క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కాలనీవాసులు తమ సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంఘం సభ్యులు క్రాంతి, శైలు, నర్సయ్య, లక్ష్మీనర్సింలు, బీజేపీ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో ప్రత్యేక భజనలు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో ఆదివారం భక్తులు కార్తీకమాస ప్రభాతఫేరి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు వేకువజాముననుంచి తెల్లవారుజాము వరకు మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా భజన చేస్తూ ప్రభాతఫేరి నిర్వహిస్తారు. కార్తీక మాసం ముగింపు వరకు భక్తులు భజనలు చేస్తూ, పాటలు పాడుతూ భక్తిపారవశ్యంలో మునిగిపోతారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. అమ్మవారికి భక్తులు అర్చనలు నిర్వహించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

హెచ్‌ఆర్‌హెచ్‌ఏ లీగల్ సెల్ చైర్మన్‌గా సలీం



కామారెడ్డి అర్బన్: హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్(హెచ్‌ఆర్‌హెచ్‌ఏ) తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్‌గా కామారెడ్డికి చెందిన న్యాయవాది ఎంఏ సలీంను నియమించారు. స.హ. చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్‌గా సలీం సేవలు అందిస్తున్నందున మరింతగా మానవ హక్కులపై కామారెడ్డి జిల్లాలో ప్రజలను చైతన్యం, మానవ హక్కుల పరిరక్షణకు లీగల్‌సెల్ చైర్మన్‌గా నియమించినట్లు అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎండీ సాహిల్‌ఖాన్ తెలిపారు. సలీంకు నియామక పత్రం అందజేయడంతో పాటు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ప్రతినిధులు సాజిద్, షబానా బేగం, డి.లలిత, శివపూజ లింబయ్య తదితరులు పాల్గొన్నారు.

పశుసంపదపై దృష్టి సారించాలి



భిక్కనూరు: రైతులు వ్యవసాయం సాగుతో పాటు పశు సంపదపై దృష్టి సారించాలని రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి రాజేశ్వర్ అన్నారు. ఆదివారం భిక్కనూరు మండలం ర్యాగట్లపల్లిలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశుపోషణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లోసర్ గడ్డి, అజోళ్ల గడ్డిని పెంచి వాటిని పాడి పశువులకు పశుగ్రాసంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు వెంకట్‌రెడ్డి, సిద్ధరాంరెడ్డి, దుర్గారెడ్డి, ప్రభాకర్, ప్రోగ్రాం ఇన్‌చార్జి భూపతి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్



భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పెద్దమల్లారెడ్డి, తిప్పాపూర్, మోటాట్‌పల్లి, ర్యాగట్లపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కల్లాలు

మద్నూర్(జుక్కల్): సోయాబీన్ పంట చేతికందుతుండడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ యార్డులో నిత్యం వందలాది క్వింటాళ్ల సోయా పంటను రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చి ఎండబెడుతున్నారు. మండలంలో 32 వేల ఎకరాల్లో రైతులు సోయా పంటను వేశారు. రైతులు మిషన్ల ద్వారా సోయ కల్లాలు చేపడుతున్నారు. ఎకరానికి 7 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

- గుండెకల్లూర్, ధోతి, ఖద్‌గాం మార్గంలో కుంగిన కల్వర్టు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కల్వర్టు కుంగి రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గుండెకల్లూర్ ధోతి, ఖద్‌గాం వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరి కూలిపోయింది. కూలిపోయి రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. దగ్గకు వచ్చే వరకు వాహనదారులకు గుంత తెలియడం లేదు. ఎంతో మంది వాహదారులు అదుపుతప్పి గుంతలో పడిపోయి గాయాలపాలయ్యారు. మరమ్మతులు చేపట్టాలని గుండెకల్లూర్, ధోతి, ఖద్‌గాం ప్రజలు అధికారులకు వేడుకున్నా పట్టించుకోవడం లేదు. రెండు సంవత్సరాలు అవుతున్నా తమకేమి పట్టనట్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. నెల రోజులలో ఏడుగురు వాహదారులు పడిపోయారు. ముగ్గురు వ్యక్తులకు కాలు, చేతులు విరిగి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరారు. ప్రాణాలకు హాని కలగక ముందే సంబంధిత శాఖా అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి చేశా.. మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే జాజాల సురేందర్



ముదెల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

గాంధారి(ఎల్లారెడ్డి): నియోజకవర్గం పరిధిలోని మారుమూల గ్రామాలను అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి కోసం తనను మరోసారి ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రజలను కోరారు. ఆదివారం ఆయన గాంధారిలో పర్యటించారు. ముదెల్లిలో ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. గ్రామంలో కూడలి వద్ద మాట్లాడారు. 2018 ఎన్నికల్లో గ్రామానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చానని గుర్తు చేశారు. అర్హులైన వారందరికీ ఆసరా పింఛన్లు మంజూరు చేశామన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణాలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలవుతున్నాయో లేదో ప్రజలు గమనించాలని కోరారు. ఇప్పులు అమలవుతున్న పథకాలన్నీ కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. జెడ్పీటీసీ శంకర్ నాయక్, మాజీ జెడ్పీటీసీ తానాజీరావు, ఎంపీపీ రాధాబలరామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ముదెల్లిలో ఆదివారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో కరక్‌వాడి, చద్మల్ తండా, గండివేట్ గ్రామాలకు చెందిన కార్యాకర్తలు పార్టీలో చేరారు. కండువాలు కప్పి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు.

ఉర్సులో పాల్గొన్న ఎమ్మెల్యే

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సాంచేపీరా దర్గా వద్ద ఆదివారం ఉర్సు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరై ప్రత్యేక పార్థనలు చేశారు. జెడ్పీటీసీ నర్సింలు, జిల్లా కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ మోహినొద్దిన్, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు



పెద్దకొడప్‌గల్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఈవో ప్రియాంక



బండపల్లిలో ..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): దళారులకు వరి ధాన్యం అమ్మి మోసపోవద్దని ఏఈవో ప్రియాంక సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వరి, సోయాబీన్, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈవో ప్రియాంక మాట్లాడుతూ...వరి గ్రేడ్- ఏ రకం క్వింటాలుకు రూ.2203, బి-గ్రేడ్ రకానికి రూ. 2183, సోయాకు రూ.4,600, మొక్క జొన్నను రూ.2,090 ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఏఈవో రూప, సీఈవో సందీప్ రైతులు పాల్గొన్నారు.

బండపల్లి, మద్దెల చెరువు గ్రామాల్లో..

పిట్లం(జుక్కల్): చిల్లర్గి సహకార సంఘం ఆధ్వర్యంలో బండపల్లి, మద్దెలచెరువు గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను సీఈవో సంతోష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బహుజనులు రాజకీయంగా ఎదగాలి



కుప్రియాల్‌లో మాట్లాడుతున్న సాప శివరాములు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): బహుజనులు రాజకీయంగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. ఆదివారం కుప్రియాల్‌లో బహుజనుల ఐక్యవేదిక నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బహుజనులందరు గ్రామ వార్డు సభ్యుల నుంచి ఎంపీ వరకు ఎదగాలన్నారు. జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో కమిటీలు వేస్తూ ముందుకెళ్తున్నట్లు తెలిపారు. 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరు ఏకమైతేనే రాజ్యాధికారం వస్తుందన్నారు. బహుజన కమిటీ అధ్యక్షుడు గున్నాల రాజాగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీరాం రమేశ్, ఉపాధ్యక్షుడు శ్రీరాం లింగం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీబీపేట: బీఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఆదివారం మల్కాపూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తేనే కామారెడ్డి నియోజకవర్గం పూర్తి అభివృద్ధి చెందుతుందని అన్నారు. గెలుపే లక్ష్యంగా ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్త పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్, గ్రామాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, ఉప సర్పంచ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించాలని జెడ్పీటీసీ కమ్మి నర్సింలు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్య వైశ్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బూత్‌స్థాయిలో ఓటర్లను గుర్తించి ఓట్లను అభ్యర్థించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్ రావు, రైతుబంధు మండలాధ్యక్షుడు భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడకు వచ్చే నెల 1న మందకృష్ణ రాక



బాన్సువాడ : వచ్చే నెల 1న బాన్సువాడకు ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పాత బాన్సువాడలో కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ పర్యటిస్తున్నారని అన్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



బాన్సువాడ రూరల్/మద్నూర్/నస్రుల్లాబాద్: బాన్సువాడ, జుక్కల్‌లో నేడు నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బాన్సువాడ, మద్నూర్, నస్రుల్లాబాద్ మండలాల బీఆర్‌ఎస్ నేతలు ప్రశాంత్, పెర్క శ్రీనివాస్, బన్సీ పటేల్‌లు వేర్వేరుగా కోరారు. బీఆర్‌ఎస్ శ్రేణులతో పాటు మహిళలు, యువకులు, రైతులు కేసీఆర్ సభకు తరలిరావాలని కోరారు.

మంత్రి కేటీఆర్ సభ కోసం స్థల పరిశీలన



దోమకొండ: మండల కేంద్రంలో నవంబర్ 1న జరుగనున్న ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సభ కోసం స్థలాన్ని ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పరిశీలించారు. పార్టీ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావ్, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజీరెడ్డి, రైతు బంధు జిల్లా డైరెక్టర్ శంకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బీఆర్‌ఎస్ ప్రచారం



వెల్లుట్లలో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

సాక్షి నెట్‌వర్క్: బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని, బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని వివరించారు.కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దని అన్నారు.



భిక్కనూరులో..



మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌లో..

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- ఇబ్బందులు పడుతున్న పిల్లలు, వృద్ధులు



రాజంపేట: మండల కేంద్రంలో వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ప్రధాన రోడ్లతో పాటు గ్రామంలోని పలు వీధులలో వీధి కుక్కలు విచ్చలవిడిగా విహరిస్తున్నాయి. దీంతో ఇటు పిల్లలు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఓ సారి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వీధి కుక్కలను పట్టించి తరలించినా 6 నెలల నుంచి వీధి కుక్కల సంఖ్య విచ్చలవిడిగా పెరిపోయింది. అదే విధంగా బోరు గడ్డ ప్రాంతంలో చికెన్ వ్యాపారులు వ్యర్థాలను విచ్చలవిడిగా పడేయటంతో బోరుగడ్డ, డంపింగ్ యార్డు ప్రాంతాలలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామంలో రోడ్లపైన కుక్కలు అడ్డుగా రావడంతో వాహనదారులు కింద పడి గాయాలపాలైన ఘటనలు చాలానే ఉన్నాయి. గ్రామ పంచాయతీ పాలక వర్గం స్పందించి వీధి కుక్కల సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాన్సువాడను జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బాన్సువాడ: బాన్సువాడను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు డిమాండ్ చేశారు. ఆదివారం బాన్సువాడ సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నేడు బాన్సువాడకు వస్తున్న సీఎం కేసీఆర్‌కు విన్నవిస్తున్నామని, బాన్సువాడను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని అన్నారు. బాన్సువాడను జిల్లాగా ప్రకటించాలని గతంలో 107 రోజుల పాటు బాన్సువాడలో రిలే నిరాహార దీక్షలు చేశామని గుర్తు చేశారు. 20 మండలాలతో బాన్సువాడను జిల్లాగా ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని అన్నారు. నాయకులు శంకర్, నందు, సతీష్, రమేష్, తదితరులున్నారు.

తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం



రక్త దాతలను అభినందిస్తున్న ప్రభుత్వ విప్

కామారెడ్డి క్రైం: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం స్మైల్ ఫర్ మెసేజ్, కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకుడు బాలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారుల కోసం రక్తాన్ని సేకరించడం అభినందనీయమన్నారు. రక్త దానం చేసిన యువకులను, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, బీఆర్‌ఎస్ నేత నిట్టు వేణుగోపాల్ రావు, స్మైల్ ఫర్ మెసేజ్ ప్రతినిధులు అబ్దుల్ కరీం , మహమ్మద్ మజీద్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరిస్తే రాజకీయంగా సమాధే

- బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజ్



తాడ్వాయిలో మాట్లాడుతున్న నీల నాగరాజు

తాడ్వాయి: బీసీలను విస్మరిస్తే రాజకీయంగా సమాధి చేస్తామని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీసీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించలేని పార్టీలను బొంద పెడతామని అన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు 20 శాతం సీట్లు మాత్రమే కేటాయించడం అవమానించడమేనని వ్యాఖ్యానించారు. బీసీలకు సీట్లు కేటాయించని పార్టీలు ఏ ముఖం పెట్టుకొని గ్రామాల్లో ఓట్లు అడుగుతారని అన్నారు. అన్ని పార్టీలు బీసీని ముఖ్యమంత్రిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.దయాకర్, ప్రధాన కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారు



సింధే సమక్షంలో చేరుతున్న కాస్లాబాద్ గ్రామస్తులు



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మల్కాపూర్‌వాసులు

- ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని పనులను చూసి ఆకర్షితులై పార్టీలో చేరడానికి ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. ఆదివారం కాస్లాబాద్‌లో ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. ఆకుల సతీష్ వర్గం మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీలో చేరడం సంతోషకరమని అన్నారు. అలాగే రేపు జుక్కల్ చౌరస్తాలో జరగబోయే ఎన్నికల ప్రచార ఆశీర్వాద సభకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి మల్కాపూర్ కాంగ్రెస్ కార్యకర్తలు

బీబీపేట: మల్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి, సర్పంచ్ రాంరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఎఫ్‌ను గెలిపించాలి



మాట్లాడుతున్న బీఎల్‌ఎఫ్ అభ్యర్థి సిద్ధిరాములు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి చరిత్రలో నిలిచిపోయేలా అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి సిరిగాధ సిద్ధిరాములు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం కోసం బీఎల్‌ఎఫ్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కామారెడ్డిలో బీసీ సీటును లాక్కుని అగ్రవర్ణ కుల కేసీఆర్ ఆధిపత్యం కోసం చూస్తున్నాడన్నారు. కేసీఆర్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. తనను గెలిపిస్తే బీడీ కార్మికులు, వ్యవసాయ కూలీలు, గల్ఫ్ బాధితులు ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తానని తెలిపారు. బీఎల్‌ఎఫ్ నాయకులు ఆంజనేయులు, వడ్ల సాయికృష్ణ, సబిత, నగేష్, గంగమణి తదితరులు పాల్గొన్నారు.

తలమడ్ల రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన రెడ్డి సంఘం సభ్యులు

రాజంపేట: తలమడ్ల గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సావుసాని సంపత్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంజీవరెడ్డి, సెక్రెటరీగా రాజేశ్వర్ రెడ్డి, కోశాధికారిగా సావుసాని సాయిరెడ్డి, సలహాదారులుగా రాజిరెడ్డి, శివకుమార్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, అలకొండ రాజిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సావుసాని సంపత్ రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.